సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
సోమవారం । 26 । మే । 2025



శ్రీకృష్ణ మందిర్ నిర్మాణానికి..


అయినవిల్లి: నల్లచెరువులో అంతర్జాతీయ శ్రీకృష్ణ మందిర్ నిర్మాణానికి కేశవరపు వెంకట సూర్యనారాయణమూర్తి (అమలాపురం) ఆదివారం రూ.లక్ష విరాళం అందజేశారు.



రూ.లక్ష విరాళం

కొత్తపేట: వాడపల్లి వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో వకుళమాత అన్నప్రసాద భవనానికి కొండ్రగుంట రవి దంపతులు (పెదకాకాని) రూ.1,00,116 విరాళం సమర్పించారు.

10.50 అడుగులకు బ్యారేజీ నీటిమట్టం



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి ఆదివారం 10,816 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.50 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు నీటిని విడుదల చేయలేదు.

న్యూస్‌రీల్

'సూపర్ సిక్స్' అమలు ఎక్కడో?

వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కిషోర్



అమలాపురం టౌన్: పేదలకు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా, 2029 నాటికి పేదరికాన్ని ఎలా నిర్మూలిస్తారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి తెన్నేటి కిషోర్ అన్నారు. సంపద సృష్టిస్తానని, పేదరికాన్ని నిర్మూలిస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు పదే పదే చెబుతున్నా సూపర్ సిక్స్ అమలు చేయలేనప్పుడు అవి ఎలా సాధ్యమని ఆయన ప్రశ్నించారు. ఆదివారం అమలాపురంలో ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 2029 నాటికి రాష్ట్రంలో పేదరికాన్ని అంతం చేస్తానన్న చంద్రబాబు చెబుతున్న మాటలు హాస్యాస్పదంగా ఉన్నాయని కిషోర్ అన్నారు. ఢిల్లీ వెళ్లిన చంద్రబాబు ప్రధాని మోదీని పెట్టుబడులు, ఎగుమతులు, ఉద్యోగాల కల్పన గురించి అడిగారే తప్ప రాష్ట్రానికి ప్రత్యేక హోదా గురించి అడగలేదని అన్నారు. ప్రత్యేక హోదా వస్తే పెట్టుబడులు, ఎగుమతులు, పరిశ్రమలు, ఉద్యోగాల కల్పన దానంతటికవే వస్తాయన్న విషయాన్ని చంద్రబాబు విస్మరించి ఎంత సేపూ మోదీని పొగడడం, ఏవేవో కోరడంతోనే సరిపోతోందని ఆరోపించారు. ప్రత్యేక హోదా సాధన విషయంలో రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం వెనకబడుతోందన్నారు.

బాలాజీ స్వామి కల్యాణోత్సవాలకు శ్రీకారం



పూజలు చేస్తున్న ఆలయ ఈఓ సత్యనారాయణరాజు

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామివారి దివ్య తిరు కల్యాణోత్సవాలకు ఆదివారం శ్రీకారం చుట్టారు. వైశాఖ మాసం, కృష్ణ పక్షం, త్రయోదశి, అశ్వని నక్షత్రం శుభ ముహూర్తంలో పందిరి రాట వేసి ముహూర్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు వేదమంత్రాలతో దిగ్విజయంగా జరిపించారు. ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు పందిరి రాటకు పసుపు రాసి, కుంకుమ బొట్టు పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి కల్యాణోత్సవాలకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా నిర్విఘ్నంగా జరగాలని అభిలాషిస్తూ పందిరి రాట పాతారు. జూన్ 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకూ స్వామివారి వార్షిక కల్యాణోత్సవాలు జరుగుతాయని ఈఓ తెలిపారు. 6వ తేదీ రాత్రి 9.15 గంటలకు స్వామివారి వార్షిక కల్యాణం ఉంటుందన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

అమలాపురం రూరల్: అమలాపురంలోని జిల్లా కలెక్టరేట్ గోదావరి భవన్‌లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక జరుగుతుందని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించి, సమస్యలకు పరిష్కారం చూపుతామని అన్నారు. అలాగే జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజన్లలోని 22 మండల కేంద్రాలు, 4 మున్సిపల్ కార్యాలయాల్లో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. అర్జీదారులు ఆయా స్థాయిల్లో తమ సమస్యలపై అర్జీలు అందించవచ్చన్నారు. 1100 కాల్ సెంటర్ ద్వారా తమ ఫిర్యాదులను తెలపవచ్చని ఆయన చెప్పారు.

రేపు నిధి ఆప్ కే నికట్

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం ఈపీఎఫ్ఓ ప్రాంతీయ కార్యాలయం పరిధిలో మంగళవారం ఉదయం 9 గంటలకు నిధి ఆప్ కే నికట్ – డిస్ట్రిక్ట్ ఔట్ రీచ్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు అసిస్టెంట్ పీఎఫ్ కమిషనర్ రాధానాథ్ పట్నాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. తూర్పు గోదావరి జిల్లాకు సంబంధించి చెల్లూరు సర్వారాయ షుగర్స్‌లో, కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి పీఏసీఎస్(సొసైటీ)లో, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో అమలాపురం రూరల్ మండలం భట్నవిల్లి వెంకటరామ పీఏసీఎస్(సొసైటీ)లో ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. డిపెండెంట్ పేరెంట్ పెన్షన్, పెన్షనర్లు మరణిస్తే ఏంచేయాలి, పెన్షన్ ప్రయోజనాల కోసం అర్హత అండ్ డీఎస్‌సీ, ప్రయాస్ – పదవీ విరమణ రోజున పీపీఓ, పెన్షన్ అండ్ ఈడీఎల్ఐ కాలిక్యులేటర్‌పై అవగాహన కల్పిస్తారన్నారు. పీఎఫ్ సభ్యులు, పింఛనుదారులు, ఎస్టాబ్లిష్మెంట్లు, కొత్తగా కవర్ చేసిన ఎస్టాబ్లిష్మెంట్లు ఈ అవుట్ రీచ్ ప్రోగ్రామ్‌ను ఉపయోగించుకోవాలని అభ్యర్థిస్తున్నామన్నారు. డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ బకాయి ఉన్న పింఛనుదారులు, డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ సమర్పించడానికి ఈ క్యాంపును సందర్శించాలన్నారు.

కొబ్బరి అధరహో..

- అన్ సీజన్‌లోనూ పెరిగిన ధర
- ఇటు కొబ్బరి, అటు కురిడీకి మార్కెట్‌లో జోష్
- వెయ్యి కాయలు రూ.16 వేలు
- ఆశాజనకంగా దిగుబడులు





సాక్షి, అమలాపురం/అంబాజీపేట: శ్రీరామ నవమి నుంచి వినాయక చవితి వరకూ అంబాజీపేట కొబ్బరి మార్కెట్‌కు అన్‌సీజన్. ఒక్క అంబాజీపేట మార్కెట్‌కే మాత్రమే కాదు.. రాష్ట్రంలో కొబ్బరి పండించే ప్రతి ప్రాంతానికీ అన్‌సీజనే. చవితి పండుగకు నెల రోజుల ముందు నుంచి కొనుగోలు సీజన్ మొదలవుతుంది. అటువంటిది అన్ సీజన్‌లో కొబ్బరి ఉత్పత్తుల ధరలు గణనీయంగా పెరిగాయి. ఒకవైపు పచ్చి కొబ్బరికాయ ధర పెరగగా.. మరో వైపు కురిడీ కొబ్బరి రికార్డు స్థాయికి చేరడం గమనార్హం. ఈ రెండు ఉత్పత్తుల ధరల పెరుగుదల గడిచిన రెండు మూడు రోజుల్లోనే కావడం గమనార్హం. ఈ ప్రభావం మిగిలిన కొబ్బరి ఉత్పత్తుల ధరలపై కూడా పడనుంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 1.30 లక్షల ఎకరాల్లో కొబ్బరి సాగు జరుగుతున్న విషయం తెలిసిందే. గత రెండు నెలల ధరలు ఆశాజనకంగా ఉన్నా మార్కెట్ మందకొడిగా సాగింది. ఒక్కసారిగా ధరలు పెరగడంతో మార్కెట్‌కు కొత్త జోష్ వచ్చింది.

కొనుగోళ్లు... ఎగుమతులు

గత రెండు మూడు రోజుల్లో కొబ్బరి పచ్చికాయ ధర గణనీయంగా పెరిగింది. వెయ్యి కొబ్బరి కాయల ధర రూ.15,500 నుంచి రూ.16 వేలకు చేరింది. రెండు రోజుల కిందట రూ.13,500 నుంచి రూ.14 వేల వరకూ ఉండేది. రెండు రోజుల్లో సుమారు రూ.2 వేలు పెరగడంతో కొబ్బరి మార్కెట్‌లో జోష్ వచ్చింది. ఈ ప్రభావం రాష్ట్రవ్యాప్తంగా సాగవుతున్న సుమారు 3 లక్షల ఎకరాలపై పడింది. మిగిలిన ప్రాంతాల్లో కూడా కొబ్బరి కాయ ధర పెరగడానికి కారణమైంది. తమిళనాడు, కేరళలో కొబ్బరి దిగుబడి గణనీయంగా పడిపోయింది. దీనికితోడు గత మార్చి నెల నుంచి కొబ్బరి బొండాల సేకరణ అధికంగా ఉంది. ఈ కారణంగా ఉత్తరాది రాష్ట్రాల కొబ్బరి అవసరాలను రాష్ట్ర కొబ్బరి తీర్చాల్సి వస్తోంది. ముఖ్యంగా గుజరాత్, ఉత్తర ప్రదేశ్, బిహార్ రాష్ట్రాల స్థానిక అవసరాల కోసం మన రాష్ట్రం నుంచి కొబ్బరికాయ కొనుగోలు పెరిగింది. ఈ కారణంగా ధర పెరిగిందని స్థానిక వ్యాపారులు చెబుతున్నారు. ఉత్తరాది రాష్ట్రాలకు ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల నుంచి రోజుకు 150 లారీల వరకూ కొబ్బరి కాయల ఎగుమతి జరుగుతోందని అంచనా.

కురిడీ... సంబరపడి

అంబాజీపేట మార్కెట్‌లో కురిడీ కొబ్బరి ధరలు రికార్డు స్థాయిలో పెరిగాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ధర పలుకుతోంది. వారం రోజుల కిందట కురిడీ కొబ్బరిలో పాతకాయ గండేరా రకం (పెద్ద కాయ) ధర వెయ్యికి రూ.20 వేలు మాత్రమే ఉండేది. ఇది రూ.22,500 వరకూ పెరిగింది. అలాగే గటగటా (చిన్నకాయ) వెయ్యికి రూ.18 వేల నుంచి రూ.20 వేలకు చేరింది. కొత్త కాయలో గండేరా రూ.21,500, గటగటా రూ.19,500 చొప్పున ధర పలుకుతున్నాయి. కురిడీకి ధర రావడం వెనుక తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో కొబ్బరి దిగుబడులు లేకపోవడం కూడా ఒక కారణం. కురిడీ కొబ్బరి తమిళనాడులోని ఈరోడ్, తిరుపూర్, కేరళలోని కోజికోడ్, కర్ణాటకలో హసన్, మాండ్యాల నుంచి ఎగుమతులు అధికం. ఇక్కడ కురిడీ కొబ్బరి తయారీ తగ్గడంతో ఇతర రాష్ట్రాలకు అవసరమైన మేరకు ఎగుమతి చేయలేకపోతున్నారు. ఇది కోనసీమ కురిడీ వ్యాపారులకు వరమైంది. డిమాండ్ పెరగడంతో కురిడీ కొబ్బరి ధర పెరగడానికి కారణమైంది. ఉత్తరాదిలో ఆషాఢ మాసంలో కొబ్బరి వినియోగం అధికంగా ఉంటుంది. ఆ మాసానికి ఇంకా నెల రోజులు ఉండడంతో ధర పెరగడానికి ఇదొక కారణం. ఉభయ గోదావరి జిల్లాల నుంచి రోజుకు సుమారు 70 నుంచి 100 లారీల వరకూ కురిడీ కొబ్బరి ఎగుమతులు జరుగుతున్నాయని అంచనా.



అంబాజీపేట నుంచి ఉత్తరాది రాష్ట్రాలకు కురిడీ కొబ్బరి ఎగుమతి

మరింత పెరుగుతుందనే అంచనాతో..

కొబ్బరి ఉత్పత్తుల ధరలకు మాత్రమే కాదు.. ఇది దిగుబడికి సైతం అన్‌సీజన్. మార్చి తరువాత నుంచి ఆగస్టు వరకూ కొబ్బరి దిగుబడులు తక్కువగా ఉంటాయి. కానీ, ప్రస్తుతం ఉభయ గోదావరి జిల్లాలో కొబ్బరి దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. రెండు నెలల దింపు కాలానికి 1,500 నుంచి 2 వేల వరకూ కాయలు దిగుబడిగా వస్తున్నాయి. ఎకరాకు నెలకు సగటున 800 కాయల వరకూ దిగుబడిగా వస్తుండటం రైతులకు ఊరటనిచ్చే అంశంగా మారింది. దిగుబడి ఆశాజనకంగా ఉండడం, అందుకు తగినట్టుగా ధరలు పెరగడంతో చాలా రోజుల తరువాత అంబాజీపేట కొబ్బరి మార్కెట్‌కు జోష్ వచ్చింది. ధర మరింత పెరుగుతోందనే అంచనాతో కొబ్బరి రైతులు, కురిడీ వ్యాపారులు ఆచితూచి అమ్మకాలు చేస్తున్నారు.

ఆల్‌టైమ్ రికార్డు



కురిడీ కొబ్బరి రూ.22 వేల ధరకు చేరుకుని ఆల్‌టైమ్ రికార్డు సాధించింది. ఈ ఏడాది జనవరి నెలలో రూ.20 వేల వరకూ కురిడీ కొబ్బరి ధరలు పెరిగాయి. తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో కొబ్బరి దిగుబడులు లేక ఇతర రాష్ట్రాల నుంచి ఆర్డర్లు విరివిగా రావడంతో ఇక్కడ కొబ్బరి మార్కెట్‌కు డిమాండ్ పెరిగింది. దీంతో ధరలు బాగున్నాయి.

– **అప్పన బాలాజీ**, కురిడీ వ్యాపారి, అంబాజీపేట

పచ్చికాయ రేటు పెరగడం సంతోషం



కొబ్బరి పచ్చికాయ రేటు పెరగడం మా రైతులకు సంతోషాన్ని ఇచ్చే అంశం. కాయ ధర ఆశాజనకంగా ఉన్నా రెండు నెలలుగా మార్కెట్ మందకొడిగా ఉంది. ఇప్పుడు ధర పెరగడంతో పాటు ఎగుమతులు పెరుగుతున్నాయి. దీనివల్ల ధర మరింత వచ్చే అవకాశముంది.

– **దొమ్మేటి త్రిమూర్తులు**, కొబ్బరి రైతు, అంబాజీపేట

ఏడాది కాలంలో ఏం పొడిచారు?

- ఫ్లెక్సీలు కట్టి డబ్బాలు కొట్టుకోవడం తప్ప ఏం చేశారు?
- అసలు బాబూకొడుకులకేం తెలుసు?
- నా చరిత్ర తెలియకుండా ఏదో మాట్లాడుతున్నారు
- ఆదిరెడ్డి కుటుంబంపై గోరంట్ల ఫైర్



సమావేశంలో మాట్లాడుతున్న గోరంట్ల బుచ్చయ్యచౌదరి

రాజమహేంద్రవరం రూరల్: ''బుచ్చయ్య చౌదరి ఒక చరిత్ర. నా చరిత్ర తెలియనివారు ఏదో మాట్లాడుతున్నారు. రాజమండ్రి నగరం అభివృద్ధి నుంచి నన్ను ఎవ్వరూ విడదీయలేరు. ఏడాది కాలంగా బాబూ కొడుకులు ఏం చేశారు? నగర అభివృద్ధిలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ఏడాదిగా ఏం పొడిచారు? ఫ్లెక్సీలు కట్టుకుని డబ్బాలు కొట్టుకోవడమే చేశారు. మోరంపూడి ఫ్లై ఓవర్‌కు ఏం చేశారని ఫ్లెక్సీలు కట్టుకున్నారు? నన్ను అవమానపరచాలంటే తాతలు దిగి రావాలి'' అంటూ సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసుపై రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఫైరయ్యారు. నగరంలోని తన నివాసంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన సొంత పార్టీ టీడీపీకే చెందిన సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసును టార్గెట్ చేస్తూ నిప్పులు చెరిగారు. రూరల్ నియోజకవర్గంలో బొమ్మూరు కేంద్రంగా తెలుగు విశ్వవిద్యాలయం ఏర్పాటును ఆదిరెడ్డి వాసు తన ఘనతగా చెప్పుకోవడంపై మండిపడ్డారు. తెలుగు విశ్వ విద్యాలయం భూముల కేటాయింపులో తాను భాగస్వామినని, రాష్ట్ర విభజన తరువాత తెలుగు విశ్వ విద్యాలయాన్ని ఆంధ్రప్రదేశ్‌కు ఇవ్వడానికి కేసీఆర్ మొండికేశారని, దీని కోసం 2014–19 మధ్య అనేకసార్లు చంద్రబాబుతో తాను మాట్లాడానని చెప్పారు. వాసు వ్యవహారం చూస్తుంటే.. ఎవరో కన్న బిడ్డకు తాను తండ్రిగా చెప్పుకున్నట్లు ఉందని దుయ్యబట్టారు. సుబ్రహ్మణ్యం మైదానంలో సభ ఏర్పాటు చేసి, తాను చేసిన అభివృద్ధిని సవివరంగా చెబుతానని గోరంట్ల అన్నారు.

తారస్థాయికి చేరిన రాజకీయ వైరం

టీడీపీలో గోరంట్ల, ఆదిరెడ్డి మధ్య చిరకాలంగా నెలకొన్న రాజకీయ వైరం ప్రస్తుతం తారస్థాయికి చేరినట్లు కనిపిస్తోంది. పార్టీకి అత్యంత కీలకమైన మహానాడుకు ముందే వారి మధ్య వైరుధ్యాలు వెలుగు చూశాయి.

ఐదో రోజూ ఆగని వాన



ఐ.పోలవరం మండలం మురమళ్లలో ధాన్యం రాశులకు బరకాలతో రక్షణ



అంబాజీపేటలో వర్షాలకు కొబ్బరి తోటల్లో చేరిన నీరు

- ఒక మోస్తరు నుంచి భారీగా..
- ఉద్యాన పంటలకు మేలు

ఐ.పోలవరం: తొలకరి కన్నా ముందు జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. వరుసగా ఐదో రోజు వాన పడింది. జిల్లా వ్యాప్తంగా శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లవారు జాము వరకూ ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఉదయం ఎనిమిది గంటల వరకూ 7.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ముమ్మిడివరం మండలంలో అత్యధికంగా 44.4 మిల్లీమీటర్ల వర్షం కురవగా, మండపేటలో అత్యల్పంగా 1.2 మిల్లీమీటర్లు పడింది. ఆత్రేయపురం, అమలాపురం, అమలాపురం రూరల్‌లో అధికంగా కురిసింది. జిల్లాలో గత నాలుగు రోజులుగా పరిశీలిస్తే.. ఈ నెల 20వ తేదీన 21 మిల్లీమీటర్లు, 21న 17.2 మిల్లీమీటర్లు, 22న 12.1 మిల్లీమీటర్లు, 23న 17.9 మిల్లీమీటర్లు, 24న 6.4 మిల్లీమీటర్ల చొప్పున పడింది. దీని వల్ల రబీ రైతులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. నాలుగు రోజులుగా రబీ కోతలకు అంతరాయం ఏర్పడింది. చేలల్లో నీరు చేరడంతో యంత్రాలతో కోతలు దాదాపుగా నిలిచిపోయాయి. ధాన్యం రాశులు తడిచిపోతాయని రైతులు బరకాలు కప్పి కాపాడుకుంటున్నారు. ధాన్యంలో చెమ్మ చేరి తేమ శాతం పెరుగుతోందని వాపోతున్నారు. యంత్రాలతో కాకుండా కూలీల కోతలు, నూర్పుడుల వల్ల ఎకరాకు అదనంగా రూ.4 వేల వరకు పెట్టుబడి అవుతోందని ఆవేదన చెందుతున్నారు. వర్షాలు కొబ్బరి, కోకో, పోక వంటి దీర్ఘకాలిక పంటలతోపాటు అరటి, కంద, కర్ర పెండలం, పసుపు వంటి పంటలకు మేలు చేయనున్నాయి.

ఇంటి బాట నుంచి పోరుబాటకు..

- రోడ్డున పడిన ఎండీయూ ఆపరేటర్లు
- కూటమి ప్రభుత్వం నిర్ణయంతో అవస్థలు



కొత్తపేటలో ఇంటింటికీ రేషన్ పంపిణీ చేస్తున్న ఆపరేటర్, హెల్పర్

కొత్తపేట: ఇంటింటికీ రేషన్ సరకులు అందించే ఎండీయూ ఆపరేటర్లను కూటమి ప్రభుత్వం రోడ్డున పడేసింది.. ఈ నిర్ణయంతో జిల్లాలో 710 మంది మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్ (ఎండీయూ) ఆపరేటర్లు, హెల్పర్లను ఉపాధి కోల్పోయారు. ఏకపక్షంగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకుంటే పోరుబాటకు సిద్ధమవుతామని జిల్లాలోని ఎండీయూ ఆపరేటర్లు, హెల్పర్లు హెచ్చరిస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 2021లో ఇంటింటికీ రేషన్ సరకుల పంపిణీ కోసం రాష్ట్ర వ్యాప్తంగా 9,260 ఎండీయూలను తీసుకుని ఒక్కో వాహనానికి ఇద్దరు చొప్పున మొత్తం 18,520 మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తూ జీఓ జారీ చేసింది. నాటి నుంచి నేటి వరకూ ఇంటి వద్దకే రేషన్ సరకులు పంపిణీ చేశారు. కరోనా సమయంలో అనేక మంది ఆపరేటర్లు, హెల్పర్లు వ్యాధి బారిన పడి ఇబ్బందులు పడ్డారు. 2027 జనవరి వరకూ అగ్రిమెంట్ ఉండగా, కేవలం వైఎస్సార్ సీపీ హయాంలో ఈ పథకాన్ని ఏర్పాటు చేశారనే సాకుతో కక్షగట్టి, 20 నెలల ముందుగానే ఎండీయూ వ్యవస్థ రద్దుకు ఈ నెల 20న జరిగిన క్యాబినెట్ సమావేశంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం అన్యాయమని వారు వాపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా 355 ఎండీయూ వాహనాలకు సంబంధించి 355 మంది ఆపరేటర్లు, 355 మంది హెల్పర్లు పని చేస్తుండగా, ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో ఉపాధి కోల్పోనున్నారు.

వారి డిమాండ్లు ఇవీ..

ప్రభుత్వ నిర్ణయాన్ని పునః పరిశీలించి, ఈ కాలవ్యవధి ఉన్నంత వరకూ ఎండీయూ ఆపరేటర్లను కొనసాగించాలి. లేదా తమ సేవలను వేరే శాఖలకు మార్చాలి. కార్మిక చట్టం కింద ఎటువంటి ఉత్తర్వులు ఇవ్వకుండా, ముందస్తు సంప్రదింపులు లేకుండా తమను విధుల నుంచి తొలగించినందుకు తగిన నష్ట పరిహారాన్ని చెల్లించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. తమ న్యాయమైన డిమాండ్లకు మద్దతు ఇవ్వాలని కోరుతూ అధికార, ప్రతిపక్ష నాయకులకు వినతిపత్రాలు సమర్పించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



ఎండీయూ వ్యవస్థ ద్వారా కరోనా కాలంలోనూ ప్రాణాలు సైతం పణంగా పెట్టి సేవలు అందించాం. ఈ వ్యవస్థ ద్వారా జీవనోపాధి పొందుతున్నాం. ఇప్పుడు అర్ధాంతరంగా వ్యవస్థను రద్దు చేసి, మా జీవనోపాధికి గండి కొట్టడం ప్రభుత్వానికి భావ్యం కాదు. పునరాలోచించి ఎండీయూ ఆపరేటర్లు, హెల్పర్లకు న్యాయం చేయాలని కోరుతున్నాం.

– **బొంతు రామదాసు**, అధ్యక్షుడు, జిల్లా ఎండీయూ ఆపరేటర్ల యూనియన్, అయినవిల్లి

అభ్యసనం.. మరింత పటిష్టం

- 1, 2 తరగతుల్లో మెరుగైన అభ్యసనానికి ఎఫ్ఎల్ఎన్
- ఓడలరేవు బీవీసీ కళాశాలలో డీఆర్పీలకు శిక్షణ

ఎఫ్ఎల్ఎన్ శిక్షణలో భాగంగా యాక్టివిటీస్ ప్రదర్శిస్తున్న డీఆర్పీలు (ఫైల్)





రాయవరం: పూర్వ ప్రాథమిక, ప్రాథమిక స్థాయిలో మంచి బోధన జరిగినప్పుడే విద్యార్థి అభ్యసనా సామర్థ్యాలు మెరుగుపడతాయి. ఇందులో భాగంగా 2023 నుంచి విద్యార్థి అభ్యసనా సామర్థ్యాల పెంపునకు ఫౌండేషన్ లిటరసీ, న్యుమరసీ (ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టింది. సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ (సాల్ట్)లో భాగంగా ఎన్జీవో సంస్థ ప్రథమ్ భాగస్వామ్యంతో ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని పూర్వ ప్రాథమిక, ప్రాథమిక పాఠశాలల్లో అమలుకు పాఠశాల విద్యాశాఖ చర్యలు ప్రారంభించింది. నూతన విద్యా విధానం–2020లో భాగంగా ప్రభుత్వం పలు విద్యా సంస్కరణలను ప్రవేశ పెట్టింది. నిపుణ్ భారత్ లక్ష్యాలను సాధించే క్రమంలో ఎర్లీ చైల్డ్ సెంటర్ ఎడ్యుకేషన్ (ఈసీసీఈ)ను తీసుకొచ్చింది. ఇందులో ప్రీ ప్రైమరీ–1, 2ను అమలు చేస్తున్నారు. ప్రీ ప్రైమరీ–1లో 3–4 ఏళ్ల చిన్నారులకు, ప్రీ ప్రైమరీ–2లో 4–5 ఏళ్ల చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్య అందిస్తారు. ప్రీ ప్రైమరీలోనే పాఠశాల సంసిద్ధతా కార్యక్రమాలను అమలు చేస్తారు. ప్రీ ప్రైమరీ, ప్రైమరీలో 1, 2 తరగతులకు ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా 2026–27 విద్యా సంవత్సరానికి రెండో తరగతి నుంచి మూడో తరగతికి వెళ్లే విద్యార్థులంతా ఆయా తరగతుల అభ్యసనా సామర్థ్యాలను కచ్చితంగా పొందాల్సి ఉంటుంది. ఇందులో భాగంగా తొలుత ప్రాథమిక విద్యను బోధించే ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చేందుకు డీఆర్పీలకు శిక్షణ ఇస్తున్నారు. మండలానికి ముగ్గురు ఎస్జీటీలను డీఆర్పీలుగా ఎంపిక చేసి వారికి రెసిడెన్షియల్ మోడ్‌లో శిక్షణ అందిస్తున్నారు. దీనికి ప్రతి జిల్లాలో మండలానికి ముగ్గురు ఉపాధ్యాయులను ఎంపిక చేశారు. ఎఫ్ఎల్ఎన్ అమల్లో భాగంగా పూర్వ ప్రాథమిక విద్యను జ్ఞాన జ్యోతిగా, ప్రాథమిక విద్యను జ్ఞాన ప్రకాష్‌గా పేర్కొన్నారు.

రేపటి నుంచి రెండో దశ శిక్షణ

ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమంలో ఎంపికైన డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్ (డీఆర్పీ)లకు మొదటి దశ శిక్షణ 2023 జూలైలో ఇచ్చారు. రెండో దశ అమల్లో భాగంగా ఈ నెల 20 నుంచి 25 వరకు కేఆర్పీలకు విజయవాడలో శిక్షణిచ్చారు. ఈ నెల 27 నుంచి శిక్షణ పొందిన కేఆర్పీలు డీఆర్పీలకు శిక్షణ ఇవ్వనున్నారు. అల్లవరం మండలం ఓడలరేవు బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో పశ్చిమగోదావరి జిల్లా నుంచి 60, ఏలూరు 88, తూర్పుగోదావరి 57, కాకినాడ 63, కోనసీమ జిల్లా నుంచి 66 మంది డీఆర్పీలకు శిక్షణ ఇవ్వనున్నారు. వీరు వచ్చే నెల 5 నుంచి ఆయా జిల్లాల్లో 1, 2 తరగతులు బోధించే ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తారు.

కచ్చితంగా హాజరు కావాలి



పూర్వ ప్రాథమిక, ప్రాథమిక స్థాయిలో పునాది అభ్యసనం బలంగా ఉండాలనే ఉద్దేశంతో జ్ఞాన్ జ్యోతి, జ్ఞాన ప్రకాష్ ప్రోగ్రామ్స్‌ను గతేడాది జిల్లాలో సమర్థవంతంగా అమలు చేశాం. రెండో దశ అమల్లో భాగంగా తొలుత డీఆర్పీలకు శిక్షణ ఇస్తున్నాం. ప్రతి డీఆర్పీ శిక్షణకు హాజరై శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి.

– **డాక్టర్ షేక్ సలీం బాషా**, డీఈఓ, అమలాపురం

మంచి ఫలితాలు వస్తాయి



ఎఫ్ఎల్ఎన్‌ను సమర్థవంతంగా అమలు చేస్తే భవిష్యత్తులో మంచి ఫలితాలు వస్తాయి. తెలుగు, గణితంలో ప్రాథమిక భావనలపై పూర్తి స్థాయి అవగాహన కల్పించడం ద్వారా విద్యార్థికి మంచి పునాది ఏర్పడుతుంది. ఈ కార్యక్రమం సమర్థవంతంగా అమలుకు ఆదేశాలు ఇచ్చాం.

– **జి.నాగమణి**, ఆర్జేడీ, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ

కొనసాగిన రద్దీ

అన్నవరం: రత్నగిరిపై ఆదివారం కూడా భక్తుల రద్దీ కొనసాగింది. రత్నగిరితో పాటు వివిధ ప్రాంతాల్లో వివాహాలు చేసుకున్న నవదంపతులతో పాటు ఇతర భక్తులు కూడా వేలాదిగా సత్యదేవుని దర్శనానికి తరలి వచ్చారు. ఆలయంలో ఎక్కడ చూసినా భక్తుల సందడే కనిపించింది. సాయంత్రం వరకూ రద్దీ కొనసాగింది. సత్యదేవుని సుమారు 40 వేల మంది దర్శించుకున్నారని అధికారులు తెలిపారు. వ్రతాలు 2 వేలు నిర్వహించారు. ఉచిత దర్శనానికి గంట, ప్రదక్షిణ దర్శనానికి అరగంట పట్టింది. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో ప్రదక్షిణ చేసి, రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి, పూజలు చేశారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. అన్నదానంలో 5 వేల మంది భక్తులు సత్య అన్నప్రసాదం స్వీకరించారు.

లోవకు పోటెత్తిన భక్తులు

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారిని దర్శించేందుకు వచ్చిన భక్తులతో లోవ దేవస్థానంలో ఆదివారం రద్దీ నెలకొంది. వివిధ జిల్లాల నుంచి ప్రత్యేక వాహనాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. క్యూ లైన్ల ద్వారా 25 వేల మంది అమ్మవారిని దర్శించుకున్నారని ఇన్‌చార్జ్ డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వహణాధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. పులిహోర, లడ్డూ ప్రసాదాల విక్రయం ద్వారా రూ.1,90,140, పూజా టికెట్లకు రూ.1,50,890, కేశఖండనకు రూ. 19,560, వాహన పూజలకు రూ.7,870, వసతి గదులు, కాటేజీలు, పొంగలి షెడ్ల అద్దెలు రూ.68,926, విరాళాలు రూ.1,17,219 కలిపి మొత్తం రూ.5.54,605 ఆదాయం సమకూరిందని వివరించారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	22,500
గటగట (వెయ్యి)	20,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	21,500
గటగట (వెయ్యి)	19,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	14,500 – 15,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	14,500 – 15,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

వీరి కష్టం తుడిచేవారేరీ!

- అన్నవరం దేవస్థానంలో పారిశుధ్య సిబ్బందికి అవస్థలు
- ఇంకా అందని ఏప్రిల్ నెల జీతాలు
- గత నెలలోనూ ఇదే పరిస్థితి
- పట్టించుకోని అధికార యంత్రాంగం

అన్నవరం: ఒకసారి తప్పు జరిగితే పొరపాటు అని సరిదిద్దుకోవచ్చు.. రెండో సారి కూడా అదే పునరావృతమైతే ఏమనుకోవాలో దేవుడికెరుక. అన్నవరం దేవస్థానంలో అధికారుల పనితీరు సిబ్బందిని ఇబ్బందుల పాల్జేస్తోంది. సత్యదేవుని దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న 349 మంది పారిశుధ్య సిబ్బందికి ఏప్రిల్ నెల జీతాలు ఇంకా చెల్లించలేదు. మే నెల కూడా మరో వారం రోజుల్లో ముగిసిపోతుండగా, ఇంకా గత నెల జీతాలు ఇవ్వకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వచ్చే జీతమే తక్కువ.. అదీ సకాలంలో అందడం లేదని సిబ్బంది నిట్టూర్పు వదులుతున్నారు. ఈ ఆలస్యం ఈ నెల మాత్రమే అనుకుంటే పొరబడినట్టే. గత నెలలో కూడా మార్చి నెల జీతం ఏప్రిల్ 30న ఇచ్చారు. అది కూడా జీతం ఆలస్యం అయ్యిందని, ఏప్రిల్ 25న 'మాకు జీతాలు ఎప్పుడిస్తారు స్వామీ...?' అంటూ 'సాక్షి' దినపత్రికలో వచ్చిన కథనాన్ని చూసి ఆదరాబాదరాగా ఫైల్ నడిపి నెలాఖరున వారి అకౌంట్‌లో వేశారు. అయితే అధికారులు మాత్రం తమ తప్పేమీ లేదని పాత పాటే పాడుతున్నారు. గత నెలలో వివరణ ఇచ్చినట్టుగానే దేవస్థానానికి పారిశుధ్య సిబ్బందిని సరఫరా చేస్తున్న గుంటూరుకు చెందిన కనకదుర్గా ఏజెన్సీ ఆ సిబ్బందికి చెల్లించాల్సిన పీఎఫ్ మొత్తాన్ని ఆలస్యంగా బ్యాంకులో జమ చేయాల్సి రావడంతోనే జాప్యం అయ్యిందని అంటున్నారు. ఒకటి రెండ్రోజుల్లో జీతాలు చెల్లిస్తామని చెప్పుకొస్తున్నారు.



సత్యదేవుని రథోత్సవం సందర్భంగా కొండ దిగువన రోడ్లు తుడుస్తున్న సిబ్బంది (ఫైల్)

పని పెరిగింది.. జీతం ఆగింది

మే నెల ఏడో తేదీ నుంచి 13వ తేదీ వరకూ సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాల సందర్భంగా దేవస్థానంలో పారిశుధ్య సిబ్బంది అదనంగా విధులు నిర్వహించాల్సి వచ్చింది. దీనికితోడు వివాహాల కారణంగా పెళ్లిబృందాలతో దేవస్థానం రద్దీగా మారి చెత్త పెరిగింది. బాత్‌రూమ్‌లు, ఆలయ ప్రాంగణం, సత్రాలు, గదులు అదనంగా శుభ్రం చేయాల్సి వచ్చింది. ఇంత చేసినా కూడా జీతాలు అందించకపోవడంతో వారు అసంతృప్తి చెందుతున్నారు.



రత్నగిరిపై ఆలయ ప్రాంగణాన్ని శుభ్రం చేస్తున్న పారిశుధ్య సిబ్బంది

అప్పట్లో పదో తేదీకే..

హైదరాబాద్‌కు చెందిన కేఎల్‌టీఎస్ సంస్థ రెండేళ్లుగా దేవస్థానంలో శానిటరీ విధులు నిర్వహించిన విషయం తెలిసిందే. ఆ సంస్థ హయాంలో ప్రతి నెలా పదో తేదీనే సిబ్బందికి జీతాలు చెల్లించేవారు. గత నవంబర్‌తో ఆ సంస్థ గడువు ముగిసినా టెండర్ ద్వారా కొత్త సంస్థకు శానిటరీ కాంట్రాక్ట్‌కు ఎంపిక చేసేవరకూ విధులు నిర్వహించాలని దేవస్థానం కోరడంతో ఫిబ్రవరి నెలాఖరు వరకూ ఆ సంస్థ సిబ్బంది విధులు నిర్వహించారు. దాంతో మార్చి ఒకటో తేదీ నుంచి తాత్కాలికంగా శానిటరీ సిబ్బంది సరఫరాకు గుంటూరుకు చెందిన కనకదుర్గా ఏజెన్సీకి కాంట్రాక్ట్ అప్పగిస్తూ దేవదాయశాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ ఆదేశాలు జారీ చేశారు. దేవస్థానంలోని అన్ని విభాగాలు, సత్రాలు, దేవస్థానం ఆవరణ, ఆలయ ప్రాకారం, వ్రతమండపాలు, టాయిలెట్స్ తదితర చోట్ల మొత్తం 349 మంది సిబ్బంది సేవలందిస్తున్నారు. ఈ సిబ్బందికి కనీస వేతన చట్టం ప్రకారం వేతనాలు చెల్లించేందుకు అంగీకారం కుదిరింది. వీరికి శానిటరీ ఏజెన్సీ ద్వారా నెలకు సుమారు రూ.55 లక్షలు వేతనాలుగా చెల్లించాల్సి ఉంది. ఏప్రిల్ నెల జీతాలు ఇంకా చెల్లించకపోవడంతో వారు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై దేవస్థానం అధికారులను 'సాక్షి' వివరణ కోరగా.. పారిశుధ్య సిబ్బంది పీఎఫ్ మొత్తం వారి బ్యాంకు ఖాతాలకు కొత్త ఏజెన్సీ ఆలస్యంగా జమ చేయాల్సి రావడంతో జీతాలు చెల్లింపునకు జాప్యం అయ్యిందని అధికారులు తెలిపారు. త్వరలోనే చెల్లిస్తామన్నారు.

సత్యవాడలో కరోనా కలకలం

అప్రమత్తమైన వైద్య సిబ్బంది



సత్యవాడలో సిబ్బందికి సూచనలిస్తున్న వైద్యుడు విష్ణువర్ధన్

కె.గంగవరం: మండల పరిధిలోని సత్యవాడ గ్రామంలో కరోనా కేసు నమోదు కావడంతో వైద్యశాఖ అప్రమత్తమైంది. గ్రామంలో ఆదివారం పామర్రు పీహెచ్‌సీ వైద్యులు పోలిశెట్టి హర్షిత, పసుపులేటి విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఆ గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి కరోనా పాజిటివ్ రావడంతో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. వారి కుటుంబ సభ్యులను హోమ్ క్యారంటైన్‌లో ఉంచారు. పంచాయతీ సిబ్బంది గ్రామంలో పారిశుధ్య పనులు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్యంపై ఆరా తీశారు. వారు మాట్లాడుతూ సామాజిక దూరం పాటించడంతో పాటు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మాస్కులు ధరించాలని కోరారు. దగ్గడం, తుమ్మడం వంటివి చేసినప్పుడు చేతిని అడ్డుపెట్టుకోవడం, చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవడం మంచిదన్నారు. సర్పంచ్ సలాది సూర్యకళావతి, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

భూ ఆక్రమణకు పాల్పడుతున్నారని ఫిర్యాదు



సుబ్బరాజు, నరసింహరాజు సోదరులు

అమలాపురం రూరల్: తాము 68 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న 1.40 ఎకరాల భూమిని కొనుగోలు చేశామంటూ అమలాపురానికి చెందిన టీడీపీ నాయకుడు గంధం పల్లంరాజుకు చెందిన కొంతమంది వ్యక్తులు బెదిరిస్తున్నారని కామనగరువుకు చెందిన భూపతిరాజు సుబ్బరాజు, నరసింహరాజు సోదరులు వాపోతున్నారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ తాము కౌలుదారులుగా లైఫ్‌టైమ్ సాగు చేసుకోవచ్చని అమలాపురం సివిల్ కోర్టులో ట్రిబ్యునల్ ఆర్డర్ ఇవ్వడంతో భూమిని సాగు చేసుకుంటున్నామని తెలిపారు. సాగు భూమిలో లారీలతో ఇసుక తరలించి భూ ఆక్రమణకు పాల్పడుతున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. అడ్డుకుంటే తమను చంపుతామని పలువురు బెదిరించారని అన్నారు. పోలీసుల సమక్షంలో దాడికి ప్రయత్నించారని వాపోయారు. అర్ధరాత్రి సమయంలో దౌర్జన్యంగా చేలోకి ప్రవేశించి ఇసుకతో భూమిని కప్పేస్తున్నారని అన్నారు. తమకు న్యాయం జరిగే వరకూ పోరాడతామని సుబ్బరాజు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా మంత్రి పేరు చెబుతూ తమను బెదిరిస్తున్నారని బాధితులు ఆరోపించారు. మంత్రి అండదండలతో రెచ్చిపోయి భూ ఆక్రమణలకు పాల్పడుతున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్, జిల్లా ఎస్పీ, తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. దీనిపై తమకు ఫిర్యాదు అందిందని అమలాపురం తాలూకా ఎస్సై శేఖర్‌బాబు తెలిపారు. సివిల్ వివాదం కావడంతో దర్యాప్తు చేస్తున్నామన్నారు.

స్పందించి.. సాయమందించి

హరిదాసుకు గ్రామస్తుల చేయూత

పెదపూడి: కళ్లు తిరిగి కిందపడి తీవ్ర అనారోగ్యానికి గురైన హరిదాసు సూరిబాబుకు ఆదివారం జి.మామిడాడ (జీఎండీ) గ్రామస్తులు ఆర్థిక సాయం అందించి మానవత్వం చాటుకున్నారు. ఇక్కడి సూర్యనారాయణమూర్తి స్వామి ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకట నరసింహాచార్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జి.మామిడాడలో తాళ్లూరి సూరిబాబు ఎన్నో ఏళ్లుగా ధనుర్మాసం సందర్భంగా గ్రామంలో హరిదాసుగా తిరుగుతూ హరినామ సంకీర్తనలు చేసుకుంటూ ఎంతో నియమ నిష్ఠలతో ప్రజలంతా బాగుండాలని కోరుకునేవాడు. ధనుర్మాసం పూర్తయిన తర్వాత గ్రామంలో ప్రతి ఇంటికి వెళితే ఎంతో కొంత దానంగా బియ్యం, నగదు ఇవ్వడం అనవాయితీగా వస్తుంది. ఈ క్రమంలోనే హరిదాసు గ్రామంలో తిరిగేటప్పుడు కళ్లు తిరిగి పడిపోవడంతో వెన్నెముకకు బలమైన గాయం తగిలింది. అసలే అంతంత మాత్రంగా ఆర్థిక పరిస్థితి ఉండడం, వెన్నెముకకు తగిలిన గాయానికి చికిత్స నిమిత్తం రూ.లక్షలు ఖర్చు కావడంతో ఆ కుటుంబం ఇబ్బంది పడుతోంది. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు తమ గ్రామం కోసం ఏర్పాటు చేసుకున్న 'మన ఊరు– ఊరికోసం' వాట్సాప్ గ్రూప్‌లో ఈ విషయాన్ని పోస్ట్ చేశారు. ఆ పోస్టుకు స్పందించి ఎవరికి తోచిన ఆర్థిక సహాయం వారు చేశారు. సుమారు రూ.1.71 లక్షలు సమకూరింది. దీంతో ఆ కుటుంబానికి సూర్యనారాయణమూర్తి స్వామి ఆలయంలో రేజేటి వెంకట నరసింహాచార్యులు, గ్రామస్తుల చేతుల మీదుగా సాయం అందజేశారు.



జి.మామిడాడలో హరిదాసుకు ఆర్థిక సాయం చేస్తున్న అర్చకుడు వెంకట నరసింహాచార్యులు, గ్రామస్తులు

అనుమానితులు కనిపిస్తే సమాచారం ఇవ్వండి

పిఠాపురం: అనుమానితులు ఎవరైనా కనిపిస్తే పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వాలని పిఠాపురం సీఐ శ్రీనివాస్ ప్రజలకు సూచించారు. ఆదివారం పిఠాపురం జగ్గయ్య చెరువు కాలనీలో కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు ఈ సెర్చ్ నిర్వహించారన్నారు. ఆ ఏరియాలో అనుమానితులను తనిఖీ చేసి వారి నుంచి సరైన పత్రాలు లేని సుమారు 43 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశామన్నారు. 15 లీటర్ల సారా సీజ్ చేసి కేసు నమోదు చేశామని అన్నారు. అనుమానితులు కనిపించిన వెంటనే పిఠాపురం టౌన్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ఆయన ప్రజలకు సూచించారు. కొత్త వ్యక్తులకు ఇల్లు అద్దెకిచ్చేటప్పుడు వారి పూర్తి వివరాలు తెలుసుకోవాలని సీఐ అన్నారు. ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. పిఠాపురం టౌన్, రూరల్, గొల్లప్రోలు, కొత్తపల్లి ఎస్సైలు మణికుమార్, జాన్‌బాషా, ఎస్.రామకృష్ణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



సరైన రికార్డులు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్న మోటారు సైకిళ్లు

ఆ ఏడుగురినీ విధుల్లోకి తీసుకోండి

- అన్నవరం దేవస్థానానికి లేబర్ కోర్టు ఆదేశం
- కొత్త కాంట్రాక్టర్‌కు చెబుతామన్న అధికారులు



వైఎస్సార్‌సీపీ వాళ్లంటూ చిరుద్యోగుల పొట్ట కొట్టారు

'సాక్షి' దినపత్రికలో 'వైఎస్సార్ సీపీ వాళ్లంటూ చిరుద్యోగుల పొట్ట కొట్టారు' శీర్షికన వచ్చిన కథనం

అన్నవరం: సత్యదేవుని దేవస్థానంలో శానిటరీ విభాగంలో తొలగించిన ఏడుగురు సూపర్‌వైజర్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ పి.శ్రీనివాసరావు (కాకినాడ) దేవస్థానం అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం తాత్కాలికంగా శానిటరీ కాంట్రాక్టర్‌చే పని చేయిస్తున్నామని, కొత్త శానిటరీ కాంట్రాక్ట్ ఖరారయ్యాక విధుల్లోకి తీసుకోవాలని చెబుతామని దేవస్థానం అధికారులు చెప్పడంతో ఆ మేరకు ఆయన ఆదేశాలిచ్చారు. ఈ విషయాన్ని తొలగించబడిన సూపర్‌వైజర్లలో ఒకరైన కొల్లు బాబూరావు ఆదివారం తెలిపారు. సూపర్‌వైజర్ల ఫిర్యాదు మేరకు లేబర్ కోర్టు అన్నవరం దేవస్థానానికి నోటీసులు జారీ చేసింది. శనివారం తమ ముందు హాజరు కావాలని ఆదేశించడంతో దేవస్థానం తరఫున సూపరింటెండెంట్ బలువు సత్యశ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు హాజరయ్యారు. ఈ సూపర్‌వైజర్లను ఎందుకు తొలగించారని డీసీ ఆఫ్ లేబర్ శ్రీనివాసరావు అధికారులను ప్రశ్నించగా, తాము తొలగించలేదని, శానిటరీ కాంట్రాక్టర్ తొలగించారని వారు సమాధానం చెప్పారు. కాంట్రాక్టర్ ఎందుకు తొలగించారని అడగ్గా ప్రవర్తన బాగోకపోయినా, భక్తులు ఫిర్యాదు చేసినా, పని సామర్థ్యం తగ్గినా కాంట్రాక్టర్‌కు తొలగించే హక్కు ఉందని వారన్నారు. తాము దశాబ్దాల తరబడి శానిటరీ విభాగంలో పనిచేస్తున్నామని, తమ పనితీరు బాగోలేదని ఎవరూ ఫిర్యాదు చేయలేదని సూపర్‌వైజర్లు వివరించారు. దీంతో వెంటనే వారిని విధుల్లోకి తీసుకోవాలని కాంట్రాక్టర్‌తో చెప్పమనగా, త్వరలో కొత్త కాంట్రాక్టర్ వస్తారని వారికి చెబుతామని అధికారులు చెప్పినట్లు సూపర్‌వైజర్లు తెలిపారు.

తాము కాదని మాట మార్చి..

శానిటరీ సూపర్‌వైజర్లపై వైఎస్సార్ సీపీ ముద్ర వేసి ఈ నెల 15 నుంచి తొలగించారు. అధికార టీడీపీకి చెందిన నియోజకవర్గ ప్రజాప్రతినిధి ఒత్తిడితో అధికారులు వారిని తొలగించారని సూపర్‌వైజర్లు తెలిపారు. దీనిపై ఈ నెల 18న 'సాక్షి' దినపత్రికలో 'వైఎస్సార్ సీపీ వాళ్లంటూ చిరుద్యోగుల పొట్ట కొట్టారు' అనే శీర్షికన కథనం వచ్చింది. కలెక్టర్ గ్రీవెన్స్‌సెల్‌లో, లేబర్ కోర్టులో సూపర్‌వైజర్లు ఫిర్యాదు చేయడంతో దేవస్థానం అధికారులు మాట మార్చి వీరిని తొలగించింది తాము కాదని, కాంట్రాక్టర్ అని చెప్పడం చర్చనీయాంశమైంది. కొత్త కాంట్రాక్టర్‌కు వీరిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని చెబుతామని చెప్పిన అధికారులు, తమ స్థానంలో అధికార పార్టీ ప్రజాప్రతినిధి సిఫార్స్‌తో వచ్చిన ఐదుగురిని సూపర్‌వైజర్లుగా నియమించినట్లు తొలగించిన సూపర్‌వైజర్లు చెప్పారు.

బరువులెత్తారు.. సత్తా చాటారు

- ఉత్కంఠగా పవర్ లిఫ్టింగ్ పోటీలు
- 135 మంది క్రీడాకారుల రాక

అమలాపురం టౌన్: అమలాపురం హెల్త్ ఫిట్‌నెస్ జిమ్, స్పోర్ట్స్ క్లబ్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక సర్ సీవీ రామన్ స్కూల్ ప్రాంగణంలో ఆదివారం 3వ యునైటెడ్ ఈస్ట్ అండ్ వెస్ట్ గోదావరి జిల్లాల పవర్ లిఫ్టింగ్ అండ్ బెంచ్ ప్రెస్ పోటీలు జరిగాయి. ఈ పోటీలు ఉదయం నుంచి రాత్రి వరకూ ఉత్కంఠ భరితంగా సాగాయి. ఉభయ గోదావరి జిల్లాల నుంచి 135 మంది క్రీడాకారులు హాజరై బరువులెత్తి సత్తా చాటారు. తొలుత ఈ క్రీడను అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు ప్రారంభించారు. పవర్ లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్, వుమెన్, మాస్టర్ విభాగాల్లో పోటీలను నిర్వహించారు. 53 కిలోల నుంచి 260 కిలోల వరకూ బరువులను లిఫ్టర్లు ఎత్తారు. 53 కిలోలు, 59, 66, 74, 83, 93, 105 కిలోలు ఇలా పలు కేటగిరీల్లో పోటీలు జరిగాయి. వీటికి న్యాయ నిర్ణేతలుగా కాకినాడ ప్రభుత్వ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ దొమ్మేటి వెంకటరమణ, రాజమహేంద్రవరానికి చెందిన ఇంటర్నేషనల్ లిఫ్టర్, రైల్వే ఉద్యోగి డి.లక్ష్మీనారాయణ, రాజమహేంద్రవరానికి చెందిన మరో ఇంటర్నేషనల్ లిఫ్టర్ ఎ.బాలకృష్ణ, పి.గన్నవరానికి చెందిన సీనియర్ లిఫ్టర్ కత్తుల శ్రీనివాసరావులు వ్యవహరించారు. పోటీల్లో కేటగిరీల వారీగా విజేతలైన లిఫ్టర్లకు ఎప్పటికప్పుడు పోటీల నిర్వహణా సంస్థలైన హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్, స్పోర్ట్స్ క్లబ్ అసోసియేషన్లు పతకాలు, బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశాయి. హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్ కోచ్ డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో పోటీలు జరిగాయి. జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యెనుముల కృష్ణ పద్మరాజు, జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు వంటెద్దు వెంకన్నాయుడు, కోనసీమ షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు మెట్ల రమణబాబు, పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ, మున్సిపల్ మాజీ చైర్మన్ చిక్కాల గణేష్, నల్లా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ నల్లా పవన్‌కుమార్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు, సర్ సీవీ రామన్ స్కూల్ డైరెక్టర్ రవణం వేణుగోపాలరావు, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి సూదా గణపతి తదితర పట్టణ ప్రముఖులు విజేతలకు బహుమతులు అందజేశారు. వివిధ కళాశాలలకు చెందిన ఫిజికల్ డైరెక్టర్లు కరాటం రవి సుధీర్, డీఆర్కే నాగేశ్వరరావు, జోషఫ్‌లు పోటీలకు రిఫరీలుగా వ్యవహరించారు.



పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బరువు ఎత్తుతున్న ఓ లిఫ్టర్



పతకాలు, సర్టిఫికెట్లతో విజేతలు, బహుమతులు అందజేసిన పట్టణ ప్రముఖులు

సహజ వాయువు దోపిడీపై నిలదీద్దాం..

- పోరాటాలతో రాష్ట్ర వాటా సాధిద్దాం
- చమురు, సహజ వనరుల పరిరక్షణ సదస్సులో నేతల పిలుపు

అమలాపురం టౌన్: కృష్ణా గోదావరి బేసిన్‌లో ప్రకృతి పరంగా, సహజ సిద్ధంగా లభ్యమవుతున్న చమురు, సహజ వాయువు దోపిడీని అరికట్టాలని, ఈ విషయంలో ప్రజలంతా ఏకతాటిపైకి వచ్చి రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీయాలని మేధావులు, విద్యావేత్తలు, సహజ వనరుల పరిరక్షణ ప్రతినిధులు, వివిధ పార్టీల నేతలు ముక్త కంఠంతో పిలుపునిచ్చారు. చమురు, సహజ వాయువును కేజీ బేసిన్‌లో అన్వేషించి ఇతర రాష్ట్రాలకు దోచుకుని వెళ్లిపోతున్న చమురు సంస్థల నిర్వాకాన్ని అడ్డుకోవాలన్నారు. గ్యాస్, చమురు, సహజ వనరుల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ప్రెస్‌క్లబ్ భవనంలో ఆదివారం సదస్సు జరిగింది. పరిరక్షణ కమిటీ ప్రతినిధి కె.సత్తిబాబు ఆధ్వర్యంలో సామాజికవేత్త ఆలతతి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు కేంద్ర ప్రభుత్వ మాజీ సలహాదారు, ప్రొఫెసర్ వైవీఎస్ మహాదేవ్, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. కేజీ బేసిన్‌లో చమురు, సహజ వాయువుల ఖనిజ సంపద అపారంగా ఉందని గుర్తుచేస్తూ, వాటిని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని స్పష్టం చేశారు. చమురును సంస్థలు ఇతర రాష్ట్రాలకు తరలించుకుపోయి రూ.కోట్లలో లాభాలు ఆర్జిస్తుంటే.. ఇక్కడి అభివృద్ధి మాత్రం కుంటుపడుతోందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దోపిడీని నిరోధించేందుకు మనమంతా రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఉన్న 175 నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, 25 మంది ఎంపీలు కలసికట్టుగా చట్టసభల్లో ఈ దోపిడీని ప్రశ్నిస్తే రాష్ట్రానికి రావాల్సిన వాటా దానంతట అదే వస్తుందని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా ఈ దోపిడీకి అడ్డుకట్ట వేయాలని వక్తలు సూచించారు. దేశంలో లభ్యమవుతున్న సహజ వాయువుల్లో 30 శాతం కేజీ బేసిన్‌లోనే లభ్యమవుతోందని గుర్తు చేశారు. అన్వేషణలు, కార్యకలాపాల పేరుతో చమురు సంస్థలు కేజీ బేసిన్ భూములను గుల్ల చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. చమురు సంస్థల భారీ వాహనాలతో రోడ్లు ఛిద్రమవుతున్నాయన్నారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, సహజ వాయువు సాధన సమితి కన్వీనర్ కొల్లా రాజమోహన్, కోనసీమ రైల్వే సాధన సమితి కన్వీనర్ డాక్టర్ ఈఆర్ సుబ్రహ్మణ్యం, వైఎస్సార్ సీపీ నాయకుడు వంటెద్దు వెంకన్నాయుడుతోపాటు పలువురు విద్యావేత్తలు, మేధావులు ప్రసంగించారు.



సదస్సులో మాట్లాడుతున్న కేంద్ర ప్రభుత్వ మాజీ సలహాదారు మహాదేవ్

తుల్యభాగ నదిలో దూకి విద్యాకమిటీ చైర్మన్ మృతి

కాజులూరు: గొల్లపాలెం జెడ్పీ హైస్కూల్ విద్యా కమిటీ చైర్మన్, మండల వర్తక సంఘ సభ్యుడు కొల్లుశెట్టి సత్యం (పలావు సెంటర్ స్వామి) కరప మండలం గొర్రిపూడి వద్ద తుల్యభాగ నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు, స్థానికుల సమాచారం ప్రకారం.. శనివారం రాత్రి ఎనిమిది గంటల సమయంలో సత్యం తన మోటారు బైక్‌తో వెళ్లి సెల్‌ఫోన్, చెప్పులు రోడ్డుపై వదిలి వంతెనపై నుంచి తుల్యభాగ నదిలోకి దూకాడు. ఆపై ఊపిరాడక కేకలు వేయడంతో సమీప కాలువ రేవులో దుస్తులు ఉతుకుతున్న మహిళలు, స్థానికులు ఎవరో నీటిలో దూకినట్టు గమనించి బైక్, సెల్‌ఫోన్ ఆధారంగా కుటుంబీకులకు సమాచారం అందించారు. వారు సంఘటనా స్థలానికి వెళ్లి సత్యం కోసం వెతికే ప్రయత్నం చేసినా రాత్రి కావడంతో అతని ఆచూకీ లభించలేదు. ఆదివారం పోలీసులు, రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో కాకినాడ రెస్క్యూ టీమ్ వచ్చి హై స్పీడ్ బోట్లతో కాలువను జల్లెడ పట్టారు. సాయంత్రం తణుకువాడ, గొర్రిపూడి గ్రామల సరిహద్దులో సత్యం మృతదేహం కనిపించింది. ఐదేళ్ల కిందట సత్యం కుమార్తె అనారోగ్యంతో చనిపోగా భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. అతని ఆత్మహత్యకు గల కారణాలు తెలియ రాలేదు. వీఆర్వో శవ పంచనామా అనంతరం పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అందరితో కలిసిపోతూ వర్తక సంఘ నిర్వహణలో కీలకంగా వ్యవహరించే సత్యం అకాల మరణం స్థానికులను దిగ్భ్రాంతికి గురిచేసింది.



కొల్లుశెట్టి సత్యం



సత్యం మృతదేహాన్ని నీటిలో నుంచి బయటకు తీసుకువస్తున్న రెస్క్యూ టీమ్

రీ వెరిఫికేషన్‌లో పెరిగిన మార్కులు

అమలాపురం టౌన్: పదో తరగతి జవాబు పత్రాల పునః పరిశీలన (రీ వెరిఫికేషన్)లో ఓ విద్యార్థిని 16 మార్కులు అదనంగా సాధించింది. అమలాపురం మదర్‌థెరిసా ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని కె.హర్షిత లెక్కలు పదిలో మార్కులు తక్కువ రావడంతో అనుమానం వచ్చి రీ వెరిఫికేషన్‌కు అప్లై చేసింది. దీంతో 16 మార్కులు అదనంగా సాధించడంతో 572 మార్కులకు చేరింది. హర్షిత తమ పాఠశాలకు సంబంధించి ప్రథమ స్థానంలో నిలిచిందని ఆ పాఠశాల డైరెక్టర్ మంగళంపల్లి అంజిబాబు తెలిపారు.

అయినవిల్లి.. భక్తులతో శోభిల్లి

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి ఆలయం ఆదివారం భక్తులతో శోభిల్లింది. ఉదయం స్వామివారికి ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావు ఆధ్వర్యంలో మేలుకొలుపు సేవ, పంచామృతాభిషేకాలు, ఏకాదశ, లఘున్యాస పూర్వక అభిషేకాలు, శ్రీలక్ష్మీ గణపతి హోమం, గరిక పూజ చేశారు. స్వామివారిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. లఘున్యాస ఏకాదశ రుద్రాభిషేకాల్లో 55 మంది, లక్ష్మీగణపతి హోమంలో 20 జంటలు, స్వామివారి గరిక పూజలో రెండు జంటలు పాల్గొన్నాయి. మూడు జంటలు స్వామికి ఉండ్రాళ్ల పూజ చేశాయి. చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాశన నిర్వహించారు. తొమ్మిది మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. 55 మంది వాహన పూజలు చేయించుకున్నారు. ఈ ఒక్క రోజు ఆలయానికి వివిధ పూజా టిక్కెట్లు, అన్నదాన విరాళాల ద్వారా రూ.2,29,238 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

తాటాకిల్లు దగ్ధం

అంబాజీపేట: పుల్లేటికుర్రు శివారు కొల్లివారిపేటలో ఆదివారం తెల్లవారు జామున ఓ తాటాకిల్లు కాలిపోయింది. సుమారు రూ.లక్ష ఆస్తి నష్టం జరిగింది. కందేరి మంగాదేవికి చెందిన తాటాకింటికి నిప్పంటుకోవడంతో గృహోపకరణాలు అగ్నికి ఆహుతయ్యాయి. స్థానికులు, అమలాపురం అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ప్రమాదం జరగడానికి కారణాలు తెలియాల్సి ఉంది.